
బైబై గణేశా





వి నాయక నిమజ్జన వేడుకలు సోమవారం పలుచోట్ల ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. మూడురోజుల పాటు పూజలందుకున్న విఘ్ననాథుల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పెద్దలూపిల్లలూ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. తిరుపతిలోని వినాయకసాగర్, తిరుచానూరు సమీపంలోని దామినీడు చెరువు, వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం తీరం, గూడూరులోని పంబలేరు, తొట్టంబేడు మండలంలోని చిన్న సింగమాల, తంగేళ్లపాళెం సమీపంలోని తెలుగుగంగ కాలువ, సత్యవేడులోని తెలుగుగంగ కాలువలతో పాటు ఆయా ప్రాంతాల్లోని చెరువుల్లో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవోపేతంగా సాగాయి. తిరుపతి వినాయక సాగర్‌లోనే సోమవారం రాత్రి 11 గంటల సమయానికి దాదాపు 400 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు సమాచారం.





రాయలచెరువులో నిమజ్జనోత్సవం



తిరుపతి వినాయక సాగర్‌లో నిమజ్జన సందడి



తూపిలిపాళెం తీరంలో సందడి



నాయుడుపేటలో విషాదం

● తూపిలిపాళెం సముద్రతీరంలో ఒకరి మృతి... మరొకరి గల్లంతు

వాకాడు, సెప్టెంబరు 9 :వినాయక నిమజ్జనోత్సవంలో విషాదం చోటుచేసుకుంది.వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం సముద్రతీరంలో సోమవారం అలల ఉధ్రుతికి మునిగిపోయి ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు.ఎస్‌ఐ నాగబాబు కథనం మేరకు...నాయుడుపేట కావమ్మగుడి సెంటర్‌కు చెందిన యువకులు వినాయక విగ్రహాన్ని తూపిలిపాళెం సముద్రతీరానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. వినాయకుడిని నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలలతాకిడికి ఫయాజ్ (22) మృతువాత పడ్డాడు. మునిరాజ అనే యువకుడు (23) గల్లంతయ్యాడు.వీరితో పాటు వున్న శ్రీనివాసులును మత్స్యకారులు రక్షించారు. ఫయాజ్‌కు చిన్నతనంలోనే తండ్రి మృతి చెందడంతో తల్లి అన్నీ తానై పెంచింది. డిగ్రీ చదువుకున్న ఫయాజ్ రెడీమేడ్ షాపులో పనిచేస్తూ తల్లికి సహాయంగా ఉండేవాడు.గల్లంతైన మునిరాజ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. మునిరాజ కోసం గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. శవ పంచనామా నిమిత్తం ఫయాజ్ మృతదేహాన్ని బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫయాజ్ మృతదేహం

అమ్మానాన్నకు ప్రేమతో ....

సత్యవేడు, సెప్టెంబరు 9: అమ్మనాన్నలకు కానుకగా ఇచ్చేందుకు ఓ ఎన్ఆర్ఐ వేలం పాటలో గణేశ్ లడ్డును దక్కించుకున్న సంఘటన ఇది.సత్యవేడు మండలం మల్లవారిపాళెం వెస్ట్‌కు చెందిన చెల్లప్పరెడ్డి, భారతి దంపతుల కుమారుడు జశ్వంత్ వృత్తిరీత్యా లండన్‌లో ఉంటున్నాడు. వినాయక చవితి సందర్భంగా గ్రామానికి విచ్చేసిన జశ్వంత్ తన తల్లితండ్రులకు ఏదైన కానుక ఇవ్వాలనుకున్నాడు. దీంతో గ్రామంలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి చేతిలోని 22 కేజీల లడ్డును వేలం పాటలో రూ.లక్ష నలభైవేలకు పాడి దక్కించుకుని తల్లిదండ్రులకు అందించాడు.

స్వర్ణ నెమలిపై వినాయకుడు



కాణిపాకంలోని వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం వరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ నెమలి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, చినకాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, అగరంపల్లె, వడ్రాంపల్లె, దామరగుంట, కురప్పల్లె గ్రామాలకు చెందిన రెడ్డి వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామికి ఉభయదారుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. రాత్రి ఉభయదారులు గంగుండ్రి మండపం నుంచి ఉభయ వరస తీసుకు రావడంతో అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణ నెమలిపై అధిష్ఠింపచేసి పురవీధులలో ఊరేగించారు. సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఈవో గురుప్రసాద్, ఉభయదారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు: బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం మూషిక వాహన సేవ నిర్వహించనున్నారు. కాణిపాకం, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె, తిరువణంపల్లెలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

- ఐరాల(కాణిపాకం)

వరద బాధితులను ఆదుకుందాం

భూరి విరాళాలతో ముందుకు రావాలన్న కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, జిల్లా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వానికి విరాళాలు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తమ విరాళాలను తిరుపతి జిల్లా కలెక్టర్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 40915068394, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0013401, పద్మావతీపురం ఎస్‌బీఐ బ్రాంచి పేరున విరాళాలను జమ చేయొచ్చని లేదంటే చెక్ ద్వారానూ అందించాలని కోరారు. జిల్లా యంత్రాంగం నుంచి ఇప్పటికే కొంత సాయం అందజేశామని వెల్లడించారు. ఈ క్రమంలో వివిధ పరిశ్రమలు, దాతల ద్వారా 3 లక్షల వాటర్ బాటిళ్లు, 75వేల పాల ప్యాకెట్లు, జిల్లా మహిళా సమాఖ్య నుంచి 1.3 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 20వేల అగ్గిపెట్టెలు, 20వేల కొవ్వొత్తులు విజయవాడకు పంపించామని వివరించారు. రెవెన్యూ శాఖ నుంచి 200 మంది, మున్సిపాలిటీ, పంచాయతీ తదితర శాఖలనుంచి పలువురు అధికారులు, సిబ్బంది విజయవాడ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారని కలెక్టర్ తెలిపారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న డీఆర్వో కిషోర్

కలెక్టర్, డీఆర్వో విరాళం

వరద బాధితుల సహాయార్థం కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో పెంచలకిషోర్ సోమవారం ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగి ఓ కార్యక్రమంలో. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో విజయవాడ తదితర ప్రాంతాల్లో రాష్ట్రప్రభుత్వం వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. అందువల్ల తన నెల జీతంలో సగ భాగాన్ని ప్రభుత్వానికి అందజేస్తానని కలెక్టర్ ప్రకటించారు. అలాగే తనవంతుగా డీఆర్వో పెంచలకిషోర్ కూడా రూ.25వేల చెక్‌ను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశారు.



రూ.10లక్షలందజేసిన డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 9: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెకి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి విజయవాడ వరదబాధితుల సహాయార్థం రూ.10లక్షలను విరాళంగా అందజేశారు. ఈమేరకు సోమవారం విజయవాడలో మంత్రి నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలసి చెక్కు అందజేశారు. అలాగే సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు.

ఎస్వీయూ టీచింగ్ అసిస్టెంట్ దాతృత్వం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9: వరద బాధితుల కోసం ఏపీ సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళాన్ని ఎస్వీయూనివర్సిటీ కామర్స్ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా ఉన్న డాక్టర్ ఎస్. శివశంకర్ చెక్కు రూపంలో పంపారు. సహచర అకడమిక్ కన్సల్టెంట్లు అభినందించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం



చంద్రగిరి రాయల్ స్ట్రీట్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న యువత

చంద్రగిరి, సెప్టెంబరు 9: మండలంలోని పలు గ్రామాలతో పాటు, చంద్రగిరి పట్టణంలో సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వినాయక విగ్రహాలను చంద్రగిరి నూకలగుంట, నాగలచెరువులో నిమజ్జనం చేశారు. పట్టణంలోని రాయల్ స్ట్రీట్‌లో కేఆర్ గ్రూప్‌కు చెందిన యువత ఏర్పాటు చేసిన విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం మేళ తాళాలు, డ్రమ్స్ వాయిస్తూ, పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ ఊరేగింపుగా నాగలచెరువులో నిమజ్జనం చేశారు.

రామచంద్రాపురంలో...



రామచంద్రాపురం, సెప్టెంబరు 9: మండలంలోని బొప్పరాజుపల్లి, వెంకట్రామాపురం, గంగిరెడ్డిపల్లి, రామాపురంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన భారీ వినాయక ప్రతిమలను మేళ తాళాల నడుమ సోమవారం నిమజ్జనానికి రాయలచెరువుకు తరలించారు. యువకులు ఉత్సాహంగా చిందులు వేస్తూ తరలివెళ్లారు. వడమాలపేట, తిరుపతి రూరల్, వెదురుకుప్పం మండలాల నుంచి కూడా వినాయకులను నిమజ్జనానికి రాయలచెరువుకు తీసుకువచ్చారు. ఆర్‌సీపురంలో గీతాంజలి విద్యాసంస్థల యాజమాన్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. రాయలచెరువు వద్ద లైటింగ్ ఏర్పాటు చేశారు. తహసీల్దారు వెంకటరమణ, ఎస్‌ఐ రామాంజనేయులు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తమలపాకు వినాయకుడి నిమజ్జనం



అన్నదానం చేస్తున్న దొడ్ల కరుణాకర్‌రెడ్డి తదితరులు - నిమజ్జనానికి బయలుదేరిన తమలపాకు వినాయకుడు

తిరుపతి రూరల్, సెప్టెంబరు 9: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో కొలువుదీరిన తమలపాకు వినాయక ప్రతిమను సోమవారం సాయంత్రం యువత నృత్యా లు.. చిన్నారుల కేరింతల నడుమ ఓటేరు చెరువులో నిమజ్జనం చేశారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉట్లోత్సవంలో యువత, వేదపాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం

తుమ్మలగుంటలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి ప్రతిమకు మూడోరోజు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దొడ్ల కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో దాదాపు వెయ్యిమందికి అన్నదానం చేశారు. భానుకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మైసూర్‌రెడ్డి, మోహన్, నితేష్‌చౌదరి, కృష్ణ, చరణ్, కేశవ, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో...



భాకరాపేట, సెప్టెంబరు 9: చిన్నగొట్టిగల్లు మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం సోమవారం వైభవంగా నిర్వహించారు. యువత రంగులు చల్లుకుంటూ కేరింతలతో వినాయక నిమజ్జనం నిర్వహించారు.

కాణిపాక ఆలయ పవిత్రతను కాపాడండి

● మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 9: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వినాయక స్వామి ఆలయ పవిత్రతను కాపాడాలని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఓ ప్రకటనలో కోరారు. నిత్యం వేలాది మంది స్వామి దర్శనార్థం విచ్చేసే క్షేత్రంలో.. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా భక్తి భావం పెంపొందేలా ఆలయ పరిసరాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు కాణిపాక ఆలయం నుంచి ఆర్చి వరకు ఎలాంటి రాజకీయ, వ్యాపార ప్రకటనలు లేకుండా తీర్మానం చేయించి, అమలు చేశామని గుర్తుచేశారు. ఇప్పుడు అగరంపల్లె ఆర్చి నుంచి ఐరాల క్రాస్ రోడ్డు వరకు వివిధ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, ప్రకటనలతో నిండి ఉన్నాయన్నారు. దీనిపై ఆలయ అధికారులు, పోలీసులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఆలయ అధికారులు స్పందించి బ్యానర్లను తొలగించి భక్తులలో భక్తి భావం పెంపొందేలా చూడాలని సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 81,178 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,643 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తెలంగాణ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, రవీంద్రరావు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వరద బాధిత సహాయక చర్యల్లో ఎమ్మెల్యే నాని



తిరుచానూరు, సెప్టెంబరు 9: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విజయవాడ 22వ డివిజన్‌లో వరద ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వరద ప్రభావంతో బాధపడుతున్న కృష్ణలంక, భ్రమరాంబపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. డ్రైనేజీ కాలువలను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులను ప్రజలకు అందిస్తున్న స్థానిక కూటమి నాయకులను, అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సమయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం గొప్ప వరమన్నారు. ఆయన రాత్రింబవళ్లు కష్టపడి ప్రజలకు సేవ చేయడంతో పాటు నగరాన్ని మునుపటిలా తీర్చిదిద్దేందుకు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. వైసీపీ తప్పుడు ఆరోపణలు ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఎర్రావారిపాలెం ఎస్‌ఐకి చార్జి మెమో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9: అవినీతికి పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ సుబ్బరాయుడు సస్పెండ్ చేశారు. శ్రీగంధం కేసులో నిందితుల కుటుంబీకులను బెదిరించి డబ్బులు వసూలు చేయడమే ఇందుకు కారణం. గత నెల 20తేదీన ఎర్రావారిపాలెంలోని ఆటోలో శ్రీగంధం తరలిస్తుండగా జడ్పీ హైస్కూల్ వద్ద 8మందిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వీరిలో ఇర్లపాలేనికి చెందిన గుండ్రాతి కుప్పం చంద్రయ్య ఒకరు. ఆయన కుమారుడు సుబ్రమణ్యం బతుకుతెరువు కోసం కువైట్ వెళ్లి ఇటీవలే వచ్చాడు. కువైట్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీర్చి మళ్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో అతడి తండ్రి చంద్రయ్య శ్రీగంధం కేసులో పట్టుబడ్డాడు. ఇదే అదునుగా భావించిన కానిస్టేబుళ్ల దేవేంద్ర నాయక్, సి. గుర్రప్ప నిందితుడు చంద్రయ్య భార్య లక్ష్మిని, కుమారుడు సుబ్రమణ్యాన్ని డబ్బులిమ్మని బెదిరించారు. లేదంటే సుబ్రమణ్యాన్ని శ్రీగంధం కేసులో ఇరికించి కువైట్ పోనీయకుండా చూస్తామని బెదిరించారు. దీంతో ఇల్లు కట్టుకునేందుకు కష్టపడి దాచుకున్న రూ.29వేలను వారికి సమర్పించుకున్నారు. ఓ ఆటో డ్రైవర్‌ను కూడా శ్రీగంధం తరలింపు కేసు పెట్టిస్తామని బెదిరించి రూ.10 వేలు వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో శనివారం 'స్మగ్లింగ్ కేసు పెడతామని డబ్బుల వసూలు... ఎర్రావారిపాలెం స్టేషన్‌లో వసూల్‌నాయక్‌లు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్పీ సుబ్బరాయుడు స్పెషల్ బ్రాంచ్ అధికారులనుంచి వివరాలు తెప్పించుకున్నారు. డబ్బు వసూలు చేసిన కానిస్టేబుళ్ల దేవేంద్రనాయక్, గుర్రప్పలను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దారి తప్పుతున్న కానిస్టేబుళ్లపై నిర్లక్ష్య వైఖరి అవలంబించిన ఎస్‌ఐ ఎర్రిస్వామికి చార్జిమెమో ఇచ్చారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి

రామచంద్రాపురం, సెప్టెంబరు 9: మామిడి తోటల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి సునీల్ కోరారు. నెత్తకుప్పం గ్రామంలో మామిడి పంట సాగుపై అవగాహన సమావేశం సోమవారం జరిగింది. సునీల్ మాట్లాడుతూ మామిడి కాపు అనంతరం కొమ్మలను కత్తిరించడం వలన సూర్యరశ్మి పడి చీడపీడలు తగ్గుతాయన్నారు. తరువాత మూడు గ్రాముల డిల్‌టాక్స్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

విరాళాల సేకరణ



రామచంద్రాపురం, సెప్టెంబరు 9: విజయవాడ వరదబాధితుల కోసం మండల కేంద్రంలోని గీతాంజలి విద్యాసంస్థల యాజమాన్యం సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఆర్సీపురంలో సోమవారం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మాధవి, ప్రిన్సిపాల్ గోపి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

● 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 9: తిరుమల పాపవినాశనం సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఆర్‌ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్‌ఎస్‌ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం సోమవారం తిరుమల పాప వినాశనం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా, నిషేధిత అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంట పడ్డారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు దుంగలను పడవేసి పారిపోయారు. టాస్క్‌ఫోర్సు బృందం వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రాంతంలో వారు వదలి వెళ్లిన పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్‌ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఆర్‌పై పోలీసులకు శిక్షణ



పోలీసులతో సీపీఆర్ చేయిస్తున్న వైద్యులు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఎవరైనా కుప్పకూలిపోతే సీపీఆర్(హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం) చేయడంపై పోలీసులకు, విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. గత శనివారం కడపకు చెందిన ఓ యువతి గుండెపోటుతో తిరుమల క్యూలైన్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులకు, విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి, శ్రీవారి సేవకులకు సోమవారం సాయంత్రం తిరుమలలోని శ్రీవారిసేవా సదన్‌లో ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనార్థం వచ్చేవారిలో కొంతమంది గుండెపోటుతో కుప్పకూలిపోతుంటారన్నారు. వారికి సీపీఆర్ చేయడం ద్వారా కొంతమందిని రక్షించే అవకాశమున్న నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తిరుమల, తిరుపతిల్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అక్టోబరు 4 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధుల్లో ఎస్పీ తనిఖీలు నిర్వహించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఏఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు విజయ్‌కుమార్, మురళీ మోహన్‌రావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భాకరాపేట సీఐ బాధ్యతల స్వీకారం



భాకరాపేట, సెప్టెంబరు 9: భాకరాపేట సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా ఇమ్రాన్‌బాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి సైబర్ క్రైమ్‌లో పనిచేస్తూ పదోన్నతిపై భాకరాపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ తమ మొదటి ప్రాధాన్యత అన్నారు. అసాంఘిక కార్యకలాపాలపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో జేఎస్పీ అధ్యక్షుడికి గాయాలు

ఎర్రావారిపాలెం, సెప్టెంబర్ 9: రోడ్డు ప్రమాదంలో ఎర్రావారిపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ముండ్లపాటి మురళి గాయపడ్డారు. సోమవారం రాత్రి సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లిన ఆయన ఇంటికి తిరిగి వస్తుండగా భాకరాపేట వద్ద రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఆయన కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం తిరుపతిలోని వైద్యశాలకు తరలించారు. పలువురు పార్టీ నాయకులు ఆయనను పరామర్శించారు.

సోషల్ మీడియాలో నాపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారు



మాట్లాడుతున్న దేవర మనోహర్

చంద్రగిరి, సెప్టెంబరు 9: సోషల్ మీడియాలో తనపై కొంతమంది కావాలనే ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని జనసేన పార్టీ నాయకులు దేవర మనోహర్ వాపోయారు. సోమవారం చంద్రగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో భూకబ్జాలకు పాల్పడుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీ పటిష్ఠతకు కృషి చేశానని, పార్టీకి వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేక వ్యక్తిగతంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తనపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోరాడుతానని పేర్కొన్నారు. జనసేన పార్టీ నాయకులు పగడాల యువరాజు, వాకా మురళి తదితరులు పాల్గొన్నారు.

భగవంతుడి సేవే పరమావధిగా తిరుమలనంబి కైంకర్యం

రంగనాథ యతీంద్ర మహాదేశికన్



తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవంతుడి సేవే పరమావధిగా భావించి తిరుమలనంబి జీవితం మొత్తాన్ని శ్రీవారి కైంకర్యానికి అంకితం చేశారని అహోబిలం మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అన్నారు. ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1051వ అవతార మహోత్సవం సోమవారం తిరుమలలోని దక్షిణ మాడ వీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి వచ్చిన రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ తిరుమలనంబి తన తాతగారైన యమునాచార్యుల ఆజ్ఞతో తిరుమలకు వచ్చి పాపవినాశనం నుంచి తీర్థం తీసుకువచ్చి శ్రీవారికి అభిషేకం చేసేవారన్నారు. వృద్ధాప్యంలో కూడా పాపవినాశనం నుంచి స్వామి జాలిపడి అంజనాద్రిలో ఉద్భవింపజేసిన ఆకాశగంగ తీర్థంతో అభిషేకం చేయాల్సిందిగా ఆజ్ఞాపించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. సాక్షాత్తు భగవంతుడు ఉపదేశించిన భగవద్గీతలోని 700 శ్లోకాలను సంగ్రహించి యమునాచార్యులు 32 శ్లోకాలతో గీతార్థ సంగ్రహం పేరుతో గ్రంథం రచించారన్నారు. ఈశ్లోకాలు బ్రహ్మవిద్యతో సమానమైనవని చెప్పారు.

తిరుమల మొదటి పౌరుడు తిరుమలనంబి

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. శ్రీవారికి తీర్థ కైంకర్యం చేసిన తిరుమల ప్రథమ పౌరుడు తిరుమలనంబి అన్నారు. శ్రీవారి వైభవాన్ని నలుదిశలా చాటడానికి కృషి చేసిన పరమ భక్తుల జన్మదినాల సందర్భంగా ప్రతి ఏడాది వారిపేరుపై ఉన్న ఉప ఆలయాల్లో వార్షికోత్సవాలు టీటీడీ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తర్వాత ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన 16 మంది ప్రముఖ పండితులు శరణాగతి తత్వాన్ని గురించి వివరించారు. ఈకార్యక్రమంలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ప్రోగ్రాం అధికారి పురుషోత్తం, తిరుమలనంబి వంశీకులు తాతాచార్య కృష్ణమూర్తి, రంగనాథన్, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లాలో ప్రముఖుల పర్యటన

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: కేంద్ర పెట్రోలియం, సహజ వాయువులు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి, కర్ణాటక గవర్నర్ తావర్చంద్ గెహ్లాట్ మంగళ, బుధవారాల్లో జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమేరకు... కేంద్ర సహాయ మంత్రి సురేష్‌గోపి మంగళవారం తిరుపతికి చేరుకుని రాత్రికి ఇక్కడే బస చేయనున్నారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు. తరువాత శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం చెన్నైకి బయలుదేరి వెళ్లనున్నారు. అలాగే కర్ణాటక గవర్నర్ తావర్చంద్ గెహ్లాట్ మంగళవారం ఉదయం బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో వేలూరు గోల్డెన్ టెంపుల్ చేరుకుంటారు.సాయంత్రం 6.30గంటలకు తిరుమలకుచేరుకునిబసచేస్తారు. బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని బెంగళూరు వెళ్లనున్నారు.

13, 14 తేదీల్లో విజయవాడలో చేనేత ప్రదర్శన

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించే చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాల్లో పాల్గొనాలని జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, స్టార్ వీవర్స్, చేనేత కార్మికులను చేనేత జౌళి శాఖ అధికారి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంగళగిరి ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంజీ రోడ్డులోని శ్రీశేష సాయి కల్యాణ వేదికలో కొనుగోలు, అమ్మకందారులతో చేనేత ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు



అగరాలలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చంద్రగిరి, సెప్టెంబరు 9: చంద్రగిరి మండలం, అగరాల గ్రామంలో స్వీకార్, టాటా ట్రస్ట్ సం యుక్తంగా క్యాన్సర్‌పై గ్రామస్తులకు నోటి, రొ మ్ము, గర్భాశయ ముఖద్వారం తదితర సమస్యలపై అవగాహన కల్పించి, ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వైద్యులు వెంకయ్య మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి వైద్య సేవలు పొందితే, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని తెలిపారు. గ్రామంలో సుమారు 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి(జేసీఆర్), తోట చంద్రబాబు, అజీజ్, మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది మెహతాజ్, మహేంద్ర, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ కుమారి, ఆశావర్కరు ధనమ్మ, మహాలక్ష్మి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని లిక్కర్ వ్యాన్ బోల్తా

రోడ్డు పాలైన మద్యం, వ్యాను డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



బోల్తా పడిన వ్యాను, పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9: ఆర్టీసీ బస్సు ఢీకొని మద్యం తరలిస్తున్న వ్యాన్ బోల్తా పడిన ఘటన రేణిగుంట- తిరుపతి మార్గంలోని కాటన్‌మిల్లు వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. రేణిగుంట మద్యం గోడౌన్ నుంచి ఓ వ్యానులో తిరుపతిలోని అమెరికన్ బార్‌కు మద్యం తరలిస్తున్నారు. ఈ వ్యాను కాటన్‌మిల్లు వద్ద యూ టర్న్ తీసుకొంటుండగా తిరుపతికి వస్తున్న శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. వ్యాన్ బోల్తా పడటంతో బాటిళ్లు పగిలిపోయి మద్యమంతా రోడ్డు పాలైంది. వ్యాను డ్రైవర్ సరళబాలాజీకి స్వల్ప గాయాలయ్యాయి. దాదాపు 80 శాతం మద్యం బాటిళ్లు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యానును అలిపిరి స్టేషన్‌కు తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి ఇద్దరు డ్రైవర్ల వాహన రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. బస్సు డ్రైవర్ మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. రూ.25లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు.

రేపు విద్యుత్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక

తిరుపతి, (ఆటోనగర్), సెప్టెంబరు 9: తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలో ఉద్యోగులకు బుధవారం లాంగ్ టెన్నిస్, షటిల్ జట్ల ఎంపిక జరుగుతుందని స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీ వి.లీలారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు క్రీడలపట్ల ఆసక్తిగల ఉద్యోగులు, జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులు పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు. లాంగ్ టెన్నిస్ జట్టు ఎంపిక పాత తిరుచానూరు రోడ్డులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని టెన్నిస్ కోర్టులో జరుగుతుందని చెప్పారు. అలాగే షటిల్ జట్టు ఎంపిక స్థానిక బాలాజీ కాలనీలోని ఆఫీసర్స్ అండ్ సోషల్ వెల్ఫేర్ క్లబ్ ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లు ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు నెల్లూరులో జరుగనున్న ఇంటర్ సర్కిల్ పోటీల్లో తిరుపతి సర్కిల్ నుంచి పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు పోటీల్లో పాల్గొనదలచిన ఉద్యోగులు బుధవారం ఉదయం 7 గంటలకు తిరుపతికి చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మిగిలిన వివరాలకు 99665 48349 నెంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

ఇసుక లారీ బోల్తా - ఇద్దరు డ్రైవర్లకు గాయాలు



బోల్తా పడిన లారీ

చంద్రగిరి, సెప్టెంబరు 9: చంద్రగిరి మండలం, దానామూర్తి పల్లె వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం ఉదయం ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి చిత్తూరు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ మార్గమధ్యంలో దానామూర్తిపల్లె వద్దకు రాగానే టైరు పంక్చర్ అయి అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, అందులో ఉన్న డ్రైవర్లు ముత్యాలు, కుప్పయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్లు బీఎన్ కండ్రిగ సమీపంలోని కత్తివారికండ్రిగ గ్రామానికి చెందిన వారుగా తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుగు ప్రయాణాలతో బస్సుల్లో రద్దీ

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 9: వినాయక చవితి పర్వదినం సందర్భంగా రెండు రోజులు సెలవులు రావడంతో ఉపాధి రీత్యా హైదరాబాదు, బెంగళూరులో ఉన్న ప్రజలు జిల్లాలోని సొంతూళ్లకు తరలివచ్చారు. సోమవారం పనిదినం కావడంతో వచ్చినవారంతా ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. రద్దీ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ఆర్టీసీ జిల్లా యంత్రాంగం ప్రయాణికుల సౌకర్యార్థం షెడ్యూల్స్‌తో పాటు సాధారణ ఛార్జీలతోనే అదనపు బస్సులను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో హైదరాబాదుకు ఆదివారం రాత్రి 7.15గంటలకు అమరావతి ఏసీ, 7.30గంటలకు వెన్నెల ఏసీ స్లీపర్‌ను వందశాతం ఆక్యుపెన్సీతో పంపారు. అలాగే బెంగళూరుకు రాత్రి 10.15నుంచి 11.58గంటల మధ్య 18బస్సులను పంపారు. అలాగే సోమవారం కూడా బెంగళూరుకు రాత్రి 8.15నుంచి 11.45గంటల మధ్యలో 5బస్సులను నడిపింది.

నేడు స్టాటిస్టిక్స్ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9: ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగంలో మంగళవారం ఉదయం పది గంటలకు ధర్మనిధి సదస్సు నిర్వహించనున్నారు. సెనేట్ హాల్‌లో సి.డి. నాయుడు - లక్ష్మీకాంతమ్మ పేరుతో చేపట్టే ఈ సదస్సుకు పద్మవిభూషణ్ ప్రొఫెసర్ సీఆర్ రావు విరాళాన్ని అందించారు. డేటా అనాలసిస్ అంశంపై చెన్నై గణిత సంస్థ ప్రొఫెసర్ శ్రీనివాసన్ ప్రసంగించనున్నారు. ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్ పాల్గొంటారు.

చంద్రబాబు అరెస్ట్ మరచిపోలేని రోజు: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 9: చంద్రబాబు అరెస్టు మరిచిపోలేని రోజని టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అక్రమంగా అరెస్ట్‌చేసి జైలుకుపంపి సరిగ్గా సంవత్సరమైందన్నారు. ఎటువంటి కష్టాలనైనా గట్టెక్కించగల వ్యక్తి చంద్రబాబు అన్నారు. 70 ఏళ్లకు పైబడిన వయసులోనూ వరద బాధితులను ఆదుకునేందుకు ఎంత కష్టపడుతున్నారో ప్రపంచం చూస్తోందన్నారు. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ.. వినాయక చవితిరోజున చంద్రబాబు నడుంలోతు నీళ్లలో తిరుగుతూ రాత్రింబవళ్లు వరద బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని.. ఎవరి విధానం ఏంటో దీనిద్వారా తేటతెల్లమౌతోందని చెప్పారు. తిరుపతి పార్లమెంటరీ టీడీపీ కార్యదర్శి మునిరామయ్య, కార్యాలయ కార్యదర్శి మనోహరాచారి, నాయకులు గంధం బాబు, రాజయ్య, చెంగయ్య, రామచంద్ర, మునిశేఖరాచారి పాల్గొన్నారు.

జిల్లా రవాణాశాఖ అధికారిగా మురళీమోహన్



తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 9: జిల్లా రవాణాశాఖాధికారి(డీటీవో)గా కొర్రపాటి మురళీమోహన్ నియమితులయ్యారు. నెల్లూరు జిల్లాలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై తిరుపతి డీటీవోగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. మురళీమోహన్ డీటీవోగా బాధ్యతలు చేపట్టనున్నారు.

శ్రీవారి ఆలయ పేష్కార్ బాధ్యతల స్వీకారం

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పేష్కార్‌గా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల శ్రీవారి ఆలయ ఏఈవోల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ట్రెజరీ ఏఈవోగా ఉన్న రామకృష్ణను శ్రీవారి ఆలయ పేష్కార్‌గా నియమించడంతో ఆయన సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న శ్రీహరిని వైకుంఠం-2 ఏఈవోగా బదిలీ చేయగా, ఆయన కూడా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కమిటీ నిర్ణయించిన రవాణా ఛార్జీలే వసూలు చేయాలి : కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: జిల్లాస్థాయి ఇసుక కమిటీ నిర్ణయించిన మేరకు మాత్రమే రవాణా ఛార్జీలను వసూలు చేయాలని ఇసుక రవాణా వాహన యజమానులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. గనులు, భూగర్భ శాఖ, రవాణాశాఖ అధికారులు, ఇసుక రవాణా ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల యజమానులతో కలెక్టరేట్‌లో కలెక్టర్ సోమవారం సమావేశమయ్యారు. వారి ఇబ్బందులను తెలుసుకుని.. సూచనలు, సలహాలు తీసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... అందరి సూచనల మేరకు ఇసుక రవాణా ఛార్జీలను నిర్ణయించి, ఆ వివరాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఆ మేరకు మాత్రమే రవాణా ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గనుల శాఖ అధికారి ప్రకాష్‌కుమార్, జిల్లా రవాణాశాఖ అధికారి వీవీ సుబ్రహ్మణ్యం, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

గణనాథా.. సెలవిక..!

వినాయకసాగర్‌లో భక్తుల సందడి ● నిమజ్జనానికి తరలివచ్చిన 300పైగా ప్రతిమలు



కరకంబాడి రోడ్డు మీదుగా వినాయకసాగర్‌కు తరలుతున్న గణేశుడి ప్రతిమలు, హారతి ఇస్తున్న నాయకులు, సాగర్‌లో వినాయక ప్రతిమ నిమజ్జనం

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 9: గణేష్ మహరాజ్‌కీ జై అంటూ నగరవీధులు మార్మోగాయి. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మూడో రోజైన సోమవారం వినాయకసాగర్‌లో గణేశుడి ప్రతిమల నిమజ్జన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వినాయక ప్రతిమలు లీలామహల్ మీదుగా కరకంబాడి రోడ్డులో నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత మండపం వద్ద హారతులు అందుకుని నిమజ్జనానికి వెళ్లాయి. నగరంలో దాదాపు 600పైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. అందులో మూడో రోజు 300కిపైగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి. మిగిలిన విగ్రహాలు ఐదో రోజైన బుధవారం నిమజ్జనానికి తరలిరానున్నాయి. ఇకవినాయకసాగర్‌లో భక్తుల సందడి నెలకొంది. కార్పొరేషన్, పోలీసు, జల వనరులశాఖ, రెవెన్యూ వివిధ శాఖల ఆధ్వర్యంలో నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు. చిన్న ప్రతిమలను ఓ వైపు, పెద్ద ప్రతిమలను మరోవైపు క్రేన్ల సాయంతో నిమజ్జనం చేశారు.





చిందులేసిన చిన్నా పెద్దా..

వినాయక ప్రతిమలతో ఊరేగింపుగా వచ్చిన చిన్న, పెద్ద, యువత, మహిళలు సైతం ఉత్సాహంగా చిందులేశారు. స్వాగత మండపం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, టీడీపీ నేత నరసింహ యాదవ్ తదితరులు ప్రతిమలకు హారతులు పట్టారు. కాగా, నిమజ్జన కార్యక్రమంలో కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే ఆరణి పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బోట్‌లో తిరుగుతూ నిమజ్జన కార్యక్రమాన్ని వీక్షించారు. నిమజ్జన కమిటీ సభ్యులను అభినందించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా హాజరయ్యారు. నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు నవీన్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, ఎస్వీఎం వెంకటేష్, చెన్నం నవీన్, రుద్రకోటి సదాశివం, హేమకిరణ్, ఆనంద్, నవీన్‌రాయల్, కృష్ణయ్య, కల్యాణ్, వాసు, గోపి, ప్రసాద్, ఆముదాల వెంకటేష్, చెంగారెడ్డి, రెడ్డిబాబు, రోషన్ తదితరులు పాల్గొన్నారు. సాగర్ వద్ద ఏర్పాట్లను అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, అలిపిరి సీఐ రాంకిషోర్, వివిధ శాఖ అధికారులు పర్యవేక్షించగా, నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జన కమిటీ సభ్యులను అభినందించిన ఎమ్మెల్యే



బైరాగిపట్టెడలోని వినాయక ప్రతిమకు హారతి



ఉట్టి కొట్టిన ఆరణి

తిరుపతి(వైద్యం): రుయాస్పత్రిలో పారిశుధ్య కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన వినాయక ఉత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉట్టి కొట్టి సందడి చేశారు. సూపరింటెండెంట్ రవిప్రభు, ఏఆర్ఎంవో హరికృష్ణ, కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నేతలు పి.సుబ్రహ్మణ్యం, జనసేన నేతలు రఘు, సురేంద్ర, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 9: వినాయకచవితిని పురస్కరించుకుని సోమవారం రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ భవన యజమాని, టీడీపీనేత భువన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి, సురేష్, వెంకట్, ప్రసాద్, మహేష్, షణ్ముగం, ప్రసన్న, జయకుమార్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నవీన్‌కుమార్‌రెడ్డి, భువన్‌కుమార్‌రెడ్డి తదితరులు

గణేశుడి లడ్డూ రూ.1.35లక్షలు!



తిరుపతి(గాంధీ రోడ్డు): ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో వర్తకసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడి ప్రతిమ చేతిలోని లడ్డూకు సోమవారం సాయంత్రం వేలం పాట నిర్వహించారు. మార్కెట్‌కి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి రూ.1.35లక్షలకు పాట పాడి సొంతం చేసుకున్నారు.



అన్నదానం

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన మహోత్సవం సందర్భంగా సోమవారం ఎస్టీ రోడ్డులోని సీతా లక్ష్మణ హనుమ సమేత రామాలయం వద్ద పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారి కేఎల్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై అన్న ప్రసాద వితరణ చేశారు. ప్రతి పర్వదినాలకూ అన్నదానం చేస్తుంటామని కమిటీ నిర్వాహకుడు ఆర్.ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సభ్యులు సుజాత, పవన్, విష్ణు, మురళి, సత్యనారాయణ, ఆనంద్, చిరంజీవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి అర్బన్: విష్ణునివాసం వద్ద పేదలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి (జీవకోన): నిమ్మకాయల వీధిలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీనివాస శారీస్ హోల్‌సేల్ షోరూం కార్తీక్ ఆధ్వర్యంలోనూ అన్నదానం చేశారు. బీజేపీ నేతలు నవీన్‌కుమార్‌రెడ్డి భానుప్రకాష్‌రెడ్డి, మధుసూదన్, కార్పొరేటర్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో గణపతికి వీడ్కోలు

తిరుపతి(విద్య): కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన వినాయక ప్రతిమకు కలెక్టర్, డీఆర్వో తదితర అధికారులు సోమవారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'బార్ల' పంచాయితీపై అధిష్ఠానం ఆరా

● తిరుపతిలో ఏం జరుగుతోంది?

● ఇంటెలిజెన్స్‌ను నివేదిక అడిగిన సీఎంవో

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బార్ల యజమానులపై పొరుగు నియోజకవర్గానికి చెందిన టీడీపీ యువనేత సమావేశం ఏర్పాటుచేసి సెటిల్మెంట్ పంచాయితీకి తెరలేపడంపై అటు ప్రభుత్వ వర్గాల్లోనూ, ఇటు పార్టీ శ్రేణుల్లో దుమారం రేగింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలకు నెలకు రూ.20లక్షలు ఇచ్చినట్టు తమకు కూడా ఇవ్వాలని, లేకుంటే రైడింగ్‌లు తప్పవని హెచ్చరించిన నేపథ్యంలో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వాళ్లకిచ్చారు కదా.. మాకూ ఇవ్వండి..!' కథనం సీఎంవో కార్యాలయానికి చేరింది. పత్రికలో వచ్చిన కథనంపై ఇంటెలిజెన్స్ అధికారులను నివేదిక అడిగినట్టు తెలిసింది. సమావేశం జరిగిందని నిజమేనని నివేదికలో స్పష్టం చేసినట్టు సమాచారం. అదేవిధంగా ఈవ్యవహారం టీడీపీ అధిష్ఠానం దృష్టికి కూడా వెళ్లింది. తిరుపతిలో ఏమి జరుగుతోందని స్థానిక నాయకత్వాన్ని పార్టీ పెద్దలు ఆరా తీశారు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తీసుకొస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్టు సమాచారం. ఇదిలావుంటే ఆంధ్రజ్యోతి కథనం సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది. పొరుగు నియోజకవర్గం నుంచి వచ్చిన నేత ఇక్కడ పెత్తనం చేయడం ఎంతవరకు సబబు అని చర్చించుకోవడం కనిపించింది.

రేపు అల్లైడ్ హెల్త్ సైన్స్ పారామెడికల్ డిప్లొమా మిగులు సీట్లకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9: ఎస్వీ వైద్య కళాశాలలో అల్లైడ్ హెల్త్‌సైన్స్ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 9 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ 3 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు 11న ఉదయం 9.30 నిమిషాలకు ప్రిన్సిపాల్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు వెంటనే రూ.7,700 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94408 79943 నెంబరును లేదా కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

హిందూస్థాన్ స్కౌట్స్ గైడ్స్‌కు గుర్తింపు ఉంది : డీఈవో

తిరుపతి(విద్య), సెప్టెంబరు9: హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కేంద్ర మానవ వనరుల క్రీడా మంత్రిత్వశాఖ గుర్తింపు ఉన్నట్టు డీఈవో వి.శేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో నకిలీ స్కౌట్స్ గైడ్స్ కార్యకలాపాలపై పరిశీలించిన నేపథ్యంలో హిందూస్థాన్ స్కౌట్స్ గైడ్స్ సమర్పించిన దాఖలాల ప్రకారం గుర్తింపు ఉన్నట్టు తాము గుర్తించామన్నారు. అయితే పాఠశాల విద్య సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం భారత్ స్కౌట్స్ గైడ్స్‌కు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి ఉందన్నారు.

ఐసర్‌కు ఆర్టీసీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 9: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)కు ఆర్టీసీ బస్సుల రవాణాను సోమవారం ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలని ఐసర్ ప్రొఫెసర్ కె.విజయమోహన్‌పిళ్లై జిల్లా ఆర్టీసీ యంత్రాంగాన్ని కోరారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టి మంగళం డిపోకు చెందిన ఆర్డినరీ బస్సును ఎంపిక చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు సెంట్రల్ బస్సుస్టేషన్‌లోని శ్రీహరి బస్టాండులో ప్లాట్‌ఫామ్ నెంబరు 20.. వెంకటగిరి పాయింట్ నుంచి ఈ బస్సు బయల్దేరుతుంది. రేణిగుంట, ఏర్పేడు మీదుగా 9.10గంటలకు ఐసర్‌కు చేరుకుంటుంది. సాయంత్రం 4.55గంటలకు తిరుపతిలో బయల్దేరి ఆరు గంటలకు ఐసర్‌కు చేరుకుంటుంది. దీంతోపాటు వెంకటగిరి డిపోకు చెందిన ఆర్డినరీ 6, ఎక్స్‌ప్రెస్ 6బస్సులు కూడా ఐసర్ వద్ద ఆపేలా డీపీటీవో ఉత్తర్వులు జారీచేశారు. ఈ బస్సులు వెంకటగిరి, తిరుపతి మధ్య ఉదయం 5నుంచి రాత్రి 9గంటల వరకు ప్రతి అరగంటకో బస్సు నడుస్తుంది.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9: తిరుపతి- చంద్రగిరి రైలు పట్టాలపై 25 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. రైల్వే పాయింట్లను సిబ్బంది తనిఖీ చేస్తుండగా ఎస్వీ డెయిరీ ఫారం వద్ద రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఓ యువకుడు మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. వ్యక్తిగత వివరాలు తెలియరాలేదని, ఆచూకీ తెలిసినవారు 86885 46060 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 9: చేతి వృత్తులు నేర్చుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని రాస్ మహిళా పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు తెలిపారు. రాస్-జన్‌శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లోని రాస్‌క్లస్టర్ ఆఫీస్‌లో సోమవారం మహిళలకు టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జన్ శిక్షణ సంస్థాన్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ, సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

లోపాల్లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి

● పొరపాట్లుచేస్తే చర్యలు తప్పవు: కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించి లోపాల్లేని విధంగా ఓటర్ల జాబితా తయారు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. మండల, గ్రామ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల ఫొటోలు స్పష్టంగా కనబడేలా జాగ్రత్తవహించాలని చెప్పారు. వచ్చే ఆదివారం నాటికి సర్వే పూర్తికావాలన్నారు. సర్వేలో పురోగతి తక్కువగా ఉన్న సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో మరింతగా పనిచేయాలని ఆదేశించారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, గ్రామ వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి, డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

నులిపురుగులను నిర్మూలిస్తేనే పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల సక్రమంగా ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఈనెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన రెండో విడత కార్యక్రమం జరగనుండటంతో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరితో కలిసి దీనికి సంబంధించిన పోస్టర్లను, బ్యానర్లను ఆవిష్కరించారు. 17న అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ అధికారులు పద్మావతి, డీఈవో శేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి జయలక్ష్మి, డీసీహెచ్ఎస్ ఆనందరావు, జిల్లా ఎపిడమాలజిస్ట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీపద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశికళ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9: శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.శశికళను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అదనపు ప్రిన్సిపాల్‌గా ఉన్న ఈమె ప్రస్తుతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు పూర్తి బాధ్యతలను అప్పగించారు.

తిరుపతి యాదవ వీధిలో రాగి అష్టలక్ష్మి కలిశాలతో వినాయక విగ్రహం



తిరుపతి యాదవ వీధి యూత్ ఆధ్వర్యంలో రాగి అష్టలక్ష్మి కలిశాల చెంబుతో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. తిరుపతిలోని భక్తులను ఈ విగ్రహం విశేషంగా ఆకర్షిస్తోంది. తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పులిగోరు మురళి ప్రత్యేక ఆహ్వానం మేరకు వెళ్లి ఆ విగ్రహానికి విశేష పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గంజి సుధాకర్ రెడ్డి, తెలుగు యువత శరత్ ఎస్‌కేడి నగర్ విజయ్, లోకేష్ యాదవ్, దయాకర్ యాదవ్, బాలాజి, నాగేశ్వరరావు యాదవ్, ఆనంద్ యాదవ్, బాబు యాదవ్, ధీరజ్, శ్రీధర్, మధు, సాయి, శేషు, వాసు తదితరులు పాల్గొన్నారు

క్యాన్సర్‌పై ఎస్వీయూలో అంతర్జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9: క్యాన్సర్ నివారణపై ఎస్వీయూనివర్సిటీలో అంతర్జాతీయ సదస్సు జరగనుంది. బయో టెక్నాలజీ విభాగం - అమెరికాలోని హెమటాలజీ వర్సిటీ సంయుక్తంగా ఈ సదస్సును డిసెంబరు 27వ తేదీ నుంచి మూడ్రోజులపాటు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఎగ్జామ్, అకడమిక్ సెక్షన్లలో తనిఖీలు

ఎస్వీయూ ఎగ్జామ్, అకడమిక్ సెక్షన్లలో ఇన్‌చార్జి వీసీ అప్పారావు తనిఖీలు చేపట్టారు. సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులకు సకాలంలో పనులు చేసి పంపాలని ఉద్యోగులకు సూచించారు.

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

ప్రతి సోమవారం విక్రయాలుంటాయన్న కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: కలెక్టరేట్‌లో ఇకపై ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయాలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఆరోగ్యానికి మంచివన్నారు. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, పీజీఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజలు వీటిని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



విక్రయ స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 157 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు సోమవారం 157 అర్జీలు అందాయి. అర్జీల ద్వారా అందిన సమస్యలను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, నరసింహులుతో కలిసి బాధితుల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన అర్జీల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవే అత్యధికంగా 93 ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో 76 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 76 అర్జీలు అందాయి. అర్జీదారులతో ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడి.. సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9: పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ స్కాలర్ డి.ఉషారాణి డాక్టరేట్ పొందారు. మల్టీ స్పెక్ట్రోస్కోపిక్, థర్మో డైనమిక్ ఎనాలసిస్ అండ్ మాలిక్యులర్ డాకింగ్ స్టడీస్ టు ఇన్వెస్టిగేట్ ద ఇంటరాక్షన్ ఆఫ్ సెలెక్టెడ్ డ్రగ్స్ విత్ అల్బుమిన్ అంశంపై ప్రొఫెసర్ షహీన్‌బేగం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

సీపీఆర్‌పై పోలీసులకు శిక్షణ


పోలీసులతో సీపీఆర్ చేయిస్తున్న వైద్యులు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఎవరైనా కుప్పకూలిపోతే సీపీఆర్(హృదయ శ్వాస కోశ పునరుజ్జీవనం) చేయడంపై పోలీసులకు, విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. గత శనివారం కడపకు చెందిన ఓ యువతి గుండెపోటుతో తిరుమల క్యూలైన్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులకు, విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి, శ్రీవారి సేవకులకు సోమవారం సాయంత్రం తిరుమలలోని శ్రీవారిసేవా సదన్‌లో ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనార్థం వచ్చేవారిలో కొంతమంది గుండెపోటుతో కుప్పకూలిపోతుంటారన్నారు.వారికి సీపీఆర్ చేయడం ద్వారా కొంతమందిని రక్షించే అవకాశమున్న నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.తిరుమల, తిరుపతిల్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.అక్టోబరు 4 నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధుల్లో ఎస్పీ తనిఖీలు నిర్వహించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఏఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు విజయ్‌కుమార్, మురళీమోహన్‌రావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోపాల్లేని ఓటర్ల జాబితా తయారు చేయాలి

● పొరపాట్లుచేస్తే చర్యలు తప్పవు : కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: ఇంటింటి సర్వేను పక్కాగా నిర్వహించి లోపాల్లేని విధంగా ఓటర్ల జాబితా తయారు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లోని సమావేశమ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. మండల, గ్రామ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పొరపాట్లు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ల ఫొటోలు స్పష్టంగా కనబడేలా జాగ్రత్తవహించాలని చెప్పారు. వచ్చే ఆదివారం నాటికి సర్వే పూర్తికావాలన్నారు. సర్వేలో పురోగతి తక్కువగా ఉన్న సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో మరింతగా పనిచేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, గ్రామ వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి, డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ బోల్తా - డ్రైవర్లకు గాయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 9: చంద్రగిరి మండలం, దానామూర్తిపల్లె వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం ఉదయం ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి చిత్తూరు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ మార్గమధ్యంలో దానామూర్తిపల్లె వద్దకు రాగానే టైరు పంక్చరై అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, అందులో ఉన్న డ్రైవర్లు ముత్యాలు, కుప్పయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్లు బీఎన్ కండ్రిగ సమీపంలోని కత్తివారికండ్రిగ గ్రామానికి చెందిన వారుగా తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు అల్లైడ్ హెల్త్ సైన్స్ పారామెడికల్ డిప్లొమా మిగులు సీట్లకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9: ఎస్వీ వైద్య కళాశాలలో అల్లైడ్ హెల్త్‌సైన్స్ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 9 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ 3 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు 11న ఉదయం 9.30 నిమిషాలకు ప్రిన్సిపాల్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు వెంటనే రూ.7,700 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94408 79943 నెంబరును లేదా కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

హిందూస్థాన్ స్కౌట్స్‌గైడ్స్‌కు గుర్తింపు ఉంది: డీఈవో

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కేంద్ర మానవ వనరుల క్రీడా మంత్రిత్వశాఖ గుర్తింపు ఉన్నట్టు డీఈవో డాక్టర్ వి.శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో నకిలీ స్కౌట్స్ గైడ్స్ కార్యకలాపాలపై పరిశీలించిన నేపథ్యంలో హిందూస్థాన్ స్కౌట్స్ గైడ్స్ సమర్పించిన దాఖలాల ప్రకారం గుర్తింపు ఉన్నట్టు తాము గుర్తించామని పేర్కొన్నారు. అయితే పాఠశాల విద్య సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం భారత్ స్కౌట్స్ గైడ్స్‌కు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి ఉందన్నారు.

శ్రీపద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశికళ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9: శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.శశికళను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అదనపు ప్రిన్సిపాల్‌గా ఉన్న ఈమె ప్రస్తుతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు పూర్తి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

భగవంతుడి సేవే పరమావధిగా తిరుమలనంబి కైంకర్యం

రంగనాథ యతీంద్ర మహాదేశికన్



తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవంతుడి సేవే పరమావధిగా భావించి తిరుమలనంబి జీవితం మొత్తాన్ని శ్రీవారి కైంకర్యానికి అంకితం చేశారని అహోబిలం మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అన్నారు. ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1051వ అవతార మహోత్సవం సోమవారం తిరుమలలోని దక్షిణ మాడవీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి వచ్చిన రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ తిరుమలనంబి తన తాతగారైన యమునాచార్యుల ఆజ్ఞతో తిరుమలకు వచ్చి పాపవినాశనం నుంచి తీర్థం తీసుకువచ్చి శ్రీవారికి అభిషేకం చేసేవారన్నారు. వృద్ధాప్యంలో కూడా పాపవినాశనం నుంచి స్వామి జాలిపడి అంజనాద్రిలో ఉద్భవింపజేసిన ఆకాశగంగ తీర్థంతో అభిషేకం చేయాల్సిందిగా ఆజ్ఞాపించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. సాక్షాత్తు భగవంతుడు ఉపదేశించిన భగవద్గీతలోని 700 శ్లోకాలను సంగ్రహించి యమునాచార్యులు 32 శ్లోకాలతో గీతార్థ సంగ్రహం పేరుతో గ్రంథం రచించారన్నారు. ఈశ్లోకాలు బ్రహ్మవిద్యతో సమానమైనవని చెప్పారు.

తిరుమల మొదటి పౌరుడు తిరుమలనంబి

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. శ్రీవారికి తీర్థ కైంకర్యం చేసిన తిరుమల ప్రథమ పౌరుడు తిరుమలనంబి అన్నారు. శ్రీవారి వైభవాన్ని నలుదిశలా చాటడానికి కృషి చేసిన పరమ భక్తుల జన్మదినాల సందర్భంగా ప్రతి ఏడాది వారిపేరుపై ఉన్న ఉప ఆలయాల్లో వార్షికోత్సవాలు టీటీడీ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తర్వాత ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన 16 మంది ప్రముఖ పండితులు శరణాగతి తత్వాన్ని గురించి వివరించారు. ఈకార్యక్రమంలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ప్రోగ్రాం అధికారి పురుషోత్తం, తిరుమలనంబి వంశీకులు తాతాచార్య కృష్ణమూర్తి, రంగనాథన్, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక

● ఆసియాలోనే అతి పెద్ద 144 అడుగుల సమాధి

● నేడు వేనాడు అల్లాతాత దర్గా 29వ గంధోత్సవం


గంధోత్సవానికి ముస్తాబైన బాబా సమాధి

తడ, సెప్టెంబరు 8: భక్తుల విశ్వాసానికి ప్రతీక ఆ సమాధి.. మత సామరస్యానికి ఆ సమాధే నిలువెత్తు నిదర్శనం.. అదే వేనాడులో ఉన్న షేక్ దావూద్ షా వలీ అల్లాతాత దర్గా. 634 ఏళ్ల క్రితం అరబ్ దేశాల నుంచి సముద్ర జలాల్లో పడవల మీదుగా కొందరూ పకీర్లు శ్రీహరికోట మీదుగా వేనాడు దీవికి వచ్చారు. అందులో ఓ పకీర్ ఆ గ్రామంలో ప్రస్తుతం దర్గా ఉన్న ప్రదేశంలో జువ్వి చెట్టు వద్దకు చేరుకుని అక్కడే ప్రార్థనలు చేసుకొంటూ అక్కడికి వచ్చే గ్రామస్తులకు ఆరోగ్య చిట్కాలు చెబుతూ ఉండేవాడు. అలా కొద్ది రోజులు ప్రార్థనల తరువాత అక్కడికి వచ్చిన పశువుల కాపర్లతో తాను ఇక్కడ పడుకుంటానని తనపై ఇసుకను పోసి కప్పాలని కోరారు. అలాగే శనగలు, బెల్లం, బొరుగులు ఉంటాయని వాటిని తీసుకుని వెళ్లాలని గ్రామస్తులను కోరారు. ఆ పకీర్ కోరిక మేరకు గ్రామస్తులు అలాగే చేసి ఇసుకతో కప్పివేసిన తరువాత గ్రామంలోకి వెళ్లారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారందరూ ఆ ప్రదేశానికి చేరుకుని పలుగు, పారలతో ఆ ఇసుకను తొలగించి ఆ పకీరును బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఇసుకను తీయలేకపోగా ఆ సమాధి అలా పెరుగుతూ పోవడంతో మహిమ గల పకీరని గ్రామస్తులు వెనుదిరిగారు. అలా సమాధి 144 అడుగుల వరకు పెరిగి ఓ వృక్షం వద్ద ఆగిపోయింది. అలా ఆసియాలోనే అతిపెద్ద సమాధిగా ఈ పకీర్ పేరుగాంచారు.

ఏఆర్ రెహమాన్ రాకతో ప్రాచుర్యంలోకి...

వేనాడులో ఉన్న పకీర్‌కు గ్రామంలోని హిందువులే పూజలు చేస్తాండేవారు. ప్రతి అమావాస్య నాడు ఆ సమాధి నుంచి పకీర్ ఉచ్ఛ్వాస, నిచ్ఛ్వాసాలు వెలువడుతాయని గ్రామస్తుల నమ్మకం. ఇక్క అక్కడ నిద్ర చేస్తే బాబా ఆశీస్సులు దొరుకుతాయని భక్తుల నమ్మకం. ఇలా ఈ పకీరు షేక్ దావూద్ షా వలీ అల్లాతాతగా కొలుస్తున్నారు. పులికాట్ సరస్సులోని మారుమూల గ్రామం వేనాడు. ప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహమాన్ 30 ఏళ్లక్రితం దర్గాకు వచ్చి పూజలు జరిపించిన తరువాత దర్గా చరిత్ర బయట ప్రపంచానికి తెలిసింది. ఆయన ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి 28 ఏళ్ల క్రితం గంధోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం 29వ గంధోత్సవానికి గ్రామ పెద్దలు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు అల్లాతాత దర్గా పర్యవేక్షణ గ్రామస్తుల చేతుల మీదుగానే జరుగుతుంది. గంధోత్సవం నాడు గ్రామస్తులు సారెతో బాబాచెంతకు చేర్చి నిర్వహించడం ఆనవాయితీ. ఇలా హిందువుల చేతుల మీదుగానే ఈ దర్గా ప్రస్థానం మొదలై నేటికి కొనసాగుతుండడం మతసమరస్యానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు.

విద్యుద్దీపాలతో, పూలతో అలంకరణ

గంధోత్సవం సందర్భంగా దర్గా ప్రాంగణమంతా విద్యుత్ దీపాలంకరణలు పూలతో అలంకరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో గంధోత్సవానికి హాజరయ్యే అవకాశం ఉండటంతో ఆర్టీసీ సైతం సుమారు 20 వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. ఏటా గంధోత్సవం ఘనంగా నిర్వహించేవారు. గత నాలుగేళ్లల్లో మొక్కుబడిగా నిర్వహించారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో స్థానిక నాయకుడు సుదర్శన్ మొదలి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

భారీ బందోబస్తు

వేనాడులో దావూద్‌షావలి అల్లాతాత దర్గా 29వ గంధోత్సవానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అన్నారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, సుమారు 100 మంది వరకు ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లలో ఉంటారన్నారు. మంగళవారం జరిగే గంధోత్సవానికి ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఎర్రావారిపాలెం ఎస్ఐకి చార్జి మెమో

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9: అవినీతికి పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ సుబ్బరాయుడు సస్పెండ్ చేశారు.శ్రీగంధం కేసులో నిందితుల కుటుంబీకులను బెదిరించి డబ్బులు వసూలు చేయడమే ఇందుకు కారణం.గత నెల 20తేదిన ఎర్రావారిపాలెంలోని ఆటోలో శ్రీగంధం తరలిస్తుండగా జడ్పీ హైస్కూల్ వద్ద 8మందిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.వీరిలో ఇర్లపాలేనికి చెందిన గుండ్రాతి కుప్పం చంద్రయ్య ఒకరు.ఆయన కుమారుడు సుబ్రమణ్యం బతుకుతెరువు కోసం కువైట్ వెళ్లి ఇటీవలే వచ్చాడు. కువైట్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీర్చి మళ్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో అతడి తండ్రి చంద్రయ్య శ్రీగంధం కేసులో పట్టుబడ్డాడు.ఇదే అదునుగా భావించిన కానిస్టేబుళ్లు దేవేంద్ర నాయక్, సి. గుర్రప్ప నిందితుడు చంద్రయ్య భార్య లక్ష్మిని, కుమారుడు సుబ్రమణ్యాన్ని డబ్బులిమ్మని బెదిరించారు. లేదంటే సుబ్రమణ్యాన్ని శ్రీగంధం కేసులో ఇరికించి కువైట్ పోనీయకుండా చూస్తామని బెదిరించారు.దీంతో ఇల్లు కట్టుకునేందుకు కష్టపడి దాచుకున్న రూ.29వేలను వారికి సమర్పించుకున్నారు.ఓ ఆటో డ్రైవర్‌ను కూడా శ్రీగంధం తరలింపు కేసు పెట్టిస్తామని బెదిరించి రూ.10 వేలు వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది.ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో శనివారం 'స్మగ్లింగ్ కేసు పెడతామని డబ్బుల వసూలు....ఎర్రావారిపాలెం స్టేషన్‌లో వసూల్‌నాయక్‌లు ' శీర్షికన వార్త ప్రచురితమైంది.దీనిపై స్పందించిన ఎస్పీ సుబ్బరాయుడు స్పెషల్ బ్రాంచ్ అధికారులనుంచి వివరాలు తెప్పించుకున్నారు.డబ్బు వసూలు చేసిన కానిస్టేబుళ్ళు దేవేంద్రనాయక్,గుర్రప్పలను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దారి తప్పుతున్న కానిస్టేబుళ్ళపై నిర్లక్ష్య వైఖరి అవలంబించిన ఎస్ఐ ఎర్రిస్వామికి చార్జిమెమో ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'బార్ల' పంచాయితీపై అధిష్ఠానం ఆరా

తిరుపతిలో ఏం జరుగుతోంది?

ఇంటెలిజెన్స్‌ను నివేదిక అడిగిన సీఎంవో

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బార్ల యజమానులపై పొరుగు నియోజకవర్గానికి చెందిన టీడీపీ యువనేత సమావేశం ఏర్పాటుచేసి సెటిల్మెంట్ పంచాయితీకి తెరలేపడంపై అటు ప్రభుత్వ వర్గాల్లోనూ, ఇటు పార్టీ శ్రేణుల్లో దుమారం రేగింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలకు నెలకు రూ.20లక్షలు ఇచ్చినట్టు తమకు కూడా ఇవ్వాలని, లేకుంటే రైడింగ్‌లు తప్పవని హెచ్చరించిన నేపథ్యంలో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'వాళ్లకిచ్చారు కదా.. మాకూ ఇవ్వండి..!' కథనం సీఎంవో కార్యాలయానికి చేరింది. పత్రికలో వచ్చిన కథనంపై ఇంటెలిజెన్స్ అధికారులను నివేదిక అడిగినట్టు తెలిసింది. సమావేశం జరిగిందని నిజమేనని నివేదికలో స్పష్టం చేసినట్టు సమాచారం. అదేవిధంగా ఈవ్యవహారం టీడీపీ అధిష్ఠానం దృష్టికి కూడా వెళ్లింది. తిరుపతిలో ఏమి జరుగుతోందని స్థానిక నాయకత్వాన్ని పార్టీ పెద్దలు ఆరా తీశారు. ప్రభుత్వానికి, పార్టీకి చెడ్డపేరు తీసుకొస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్టు సమాచారం. ఇదిలావుంటే ఆంధ్రజ్యోతి కథనం సోషల్ మీడియాలోనూ వైరల్‌గా మారింది. పొరుగు నియోజకవర్గం నుంచి వచ్చిన నేత ఇక్కడ పెత్తనం చేయడం ఎంతవరకు సబబు అని చర్చించుకోవడం కనిపించింది.

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

ప్రతి సోమవారం విక్రయాలు ఉంటాయన్న కలెక్టర్


విక్రయ స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (విద్య), సెప్టెంబరు 9: కలెక్టరేట్‌లో ఇకపై ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయాలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ని సోమవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఆరోగ్యానికి ఎంతో మంచివన్నారు. కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, పీజీఆర్ఎస్‌కు హాజరయ్యే ప్రజలు వీటిని కొనుగోలుచేసి రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఐసర్‌కు ఆర్టీసీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 9: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)కు ఆర్టీసీ బస్సుల రవాణాను సోమవారం ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలని ఐసర్ ప్రొఫెసర్ కె.విజయమోహన్‌పిళ్లై జిల్లా ఆర్టీసీ యంత్రాంగాన్ని కోరారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టి మంగళం డిపోకు చెందిన ఆర్డినరీ బస్సును ఎంపిక చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు సెంట్రల్ బస్సుస్టేషన్‌లోని శ్రీహరి బస్టాండులో ప్లాట్‌ఫామ్ నెంబరు 20. వెంకటగిరి పాయింట్ నుంచి ఈ బస్సు బయల్దేరుతుంది. రేణిగుంట, ఏర్పేడు మీదుగా 9.10గంటలకు ఐసర్‌కు చేరుకుంటుంది. సాయంత్రం 4.55గంటలకు తిరుపతిలో బయల్దేరి ఆరు గంటలకు ఐసర్‌కు చేరుకుంటుంది. దీంతోపాటు వెంకటగిరి డిపోకు చెందిన ఆర్డినరీ 6, ఎక్స్‌ప్రెస్ 6బస్సులు కూడా ఐసర్ వద్ద ఆపేలా డీపీటీవో ఉత్తర్వులు జారీచేశారు. ఈ బస్సులు వెంకటగిరి, తిరుపతి మధ్య ఉదయం 5నుంచి రాత్రి 9గంటల వరకు ప్రతి అరగంటకో బస్సు నడుస్తుంది.

శ్రీవారి ఆలయ పేష్కార్ బాధ్యతల స్వీకారం

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పేష్కార్‌గా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల శ్రీవారి ఆలయ ఏఈవోల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ట్రెజరీ ఏఈవోగా ఉన్న రామకృష్ణను శ్రీవారి ఆలయ పేష్కార్‌గా నియమించడంతో ఆయన సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న శ్రీహరిని వైకుంఠం-2 ఏఈవోగా బదిలీ చేయగా, ఆయన కూడా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

● 10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 9: తిరుమల పాపవినాశనం సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం సోమవారం తిరుమల పాప వినాశనం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా, నిషేధిత అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంట పడ్డారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు దుంగలను పడవేసి పారిపోయారు. టాస్క్‌ఫోర్సు బృందం వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారు వదలి వెళ్లిన పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

రామచంద్రాపురం, సెప్టెంబరు 9: మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారి సునీల్ కోరారు. నెత్తకుప్పం గ్రామంలో మామిడి పంట సాగుపై అవగాహన సమావేశం సోమవారం జరిగింది. సునీల్ మాట్లాడుతూ మామిడి కాపు అనంతరం కొమ్మలను కత్తరించడం వలన సూర్యరశ్మి పడి చీడపీడలు తగ్గుతాయన్నారు. తరువాత మూడు గ్రాముల డిల్‌టాక్స్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

నిమజ్జనానికి వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం


ఒడ్డున గుట్టలుగా పడిఉన్న వినాయక ప్రతిమల ముక్కలు

వాకాడు, సెప్టెంబరు 9: అత్యంత ఘనంగా జరుపుకునే ప్రధాన పండగ వినాయక చవితి. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి నిమజ్జనానికి తూపిలిపాళెం సముద్రతీరానికి సోమవారం భారీగా ప్రతిమలను భక్తులు తీసుకొచ్చారు. అధికారుల నిర్లక్ష్యంతో సముద్రతీరాన పారిశుద్ధ్యలోపం కొట్టొచ్చినట్టు కన్పించింది. నిమజ్జనం చేసిన ప్రతిమల ముక్కలు విరిగిపడి సముద్రం ఒడ్డునే చేరడంతో వాటిని తొక్కుకొంటూ 3వ రోజు భక్తులు నిమజ్జనం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలోనూ నిమజ్జన సమయంలో రోడ్డు ప్రమాదాలు, అలల తాకిడికి మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. గతంలో జరిగిన పొరపాట్లు దృష్టిలో ఉంచుకొని నిమజ్జనాన్ని సజావుగా జరిపించాల్సిన అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. సముద్ర ఒడ్డున భారీ క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జన ఏర్పాట్లు చేసినట్టైతే ప్రమాదాలు జరగవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం


దుకాణదారులకు సూచనలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 9: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో సోమవారం బంగారు దుకాణాలు, హోల్‌సేల్ దుకాణాల యజమానులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాళ్లు, బంగారు దుకాణాల్లో సీసీ కెమెరాలను ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు ఎల్‌హెచ్ఎంఎస్(లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ను ఉపయోగించుకోవాలని తెలిపారు. వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, అలాగే కార్లల్లో ప్రయాణించేవారు సీట్ బెల్టులను వినియోగించాలన్నారు. శాంతి భద్రతల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.38 లక్షల చెక్కు అందజేత


లోకేశ్‌కు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబరు 9: వరద బాధితుల సహాయార్థం సీఎం సహయనిధికి రూ.38 లక్షల చెక్కును సోమవారం విజయవాడలో మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విజయవాడలో సంభవించిన వరదల కారణంగా నిస్సహాయస్థితికి చేరకున్న ప్రజలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలో పలువురు ముందుకు వచ్చి సీఎం సహాయ నిధికి రూ.38,32441 చెక్కులను అందించారన్నారు. అంతేకాకుండా తన సొంతనిధుల నుంచి రూ.5 లక్షల విలువైన రెండు వేలకు పైగా దుప్పట్లను వరద బాధితులకు అందిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు విజయవాడలో ఉంటూ బాధితులకు సాయం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట కిశోర్‌నాయుడు, నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం


లక్ష్మీదేవి కుటుంబీకులకు సుష్మారెడ్డి సాయం

కోట, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితులకు, నిరుపేద దళిత కుటుంబానికి తనవంతు సహకారం అందించారు. తెలుగుమహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి. మండల పరిధిలోని తిన్నెలపూడి దళితవాడలో జరిగిన అగ్నిప్రమాదంలో బి.లక్ష్మీదేవి మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి రూ. 10వేలను అందజేశారు. అదే విధంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.30వేలను సుష్మారెడ్డి టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డికి అందజేశారు.

సీఎం సహాయనిధికి విరాళం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 9: సీఎం సహాయనిధికి పలువురు టీడీపీ నాయకులు విజయవాడకు వెళ్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు చెక్కులను అందజేశారు. చిల్లకూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు రూ.7లక్షలు, కోట మండల టీడీపీ నాయకులు రూ.2.25లక్షలు, గూడూరు మండలం మాజీ వైస్ ఎంపీపీ ఎం.శ్రావణి రూ.50వేలు, ఇతరులు కూడా చెక్కులను ఎమ్మెల్యేకు ఆయన నివాసంలో అందజేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో...



గూడూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణను చేపట్టినట్లు నాయకులు చెప్పారు. సోమవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచిన సాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన రూ.8,850 నగదును రాష్ట్ర కమిటీకి అందిస్తామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, శ్రీనివాసులు, బి.వి.రమణయ్య, శంకరయ్య, సురేష్, ప్రసాద్, మణి, శేఖరాచారి, వినయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో బాధితులకు దుప్పట్లు


దుప్పట్లను పంపుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 9: విజయవాడలో వరదల కారణంగా ఇబ్బంది పడుతున్న బాధితులకు చేయూ తనందించేలా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తన సొంత నిధులతో దుప్పట్లను అందించేలా చర్యలు తీసుకున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ నుంచి విజయవాడకు పంపే దుప్పట్ల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. పి.శ్రీనివాసులు, ఎస్.చెంచు రామయ్య, రవీంద్రరెడ్డి, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.55వేలు అందజేత



నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 9: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి షార్ రిటైర్డ్ ఉద్యోగి పాపయ్య రూ.55వేల చెక్కును సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంకు అందజేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులునాయుడు, శోభన్‌నాయుడు, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను గుర్తించండి

తడ, సెప్టెంబరు 9: మండలంలోని కాళంగి నది, పాముల కాలువ పరీవాహన ప్రాంతాల్లో ఆక్రమణలపై సర్వే చేపట్టి నివేదికలు సమర్పించాలని తహసీల్దారు శరత్‌బాబు ఆదేశించారు.స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఆక్రమణలపై నివేదిక కోరిందని ఈ మేరకు ప్రతి గ్రామంలో వాస్తవ పరిస్థితులను గుర్తించాలన్నారు.

బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన

నాయుడుపేట, సెప్టెంబరు 9 : బాల్య వివాహాల నిషేధ చట్టంపై సీడీపీవో ఉమామహేశ్వరి అవగాహన కల్పించారు. పట్టణంలోని బాలికల వసతిగృహంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే టోల్‌ఫ్రీ నెం.1098కు ఫోన్ చేసి వివరాలు చెప్పాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ హసిదాబేగం, వార్డెన్ సరిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు




కట్ట పుట్టాలమ్మ ఆలయం - అమ్మవారి మూలవిరాట్

నేటి నుంచి కట్ట పుట్టాలమ్మ జాతర

రేణిగుంట, సెప్టెంబరు 9: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలో వెలసిన గ్రామదేవత కట్ట పుట్టాలమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వహణ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం నుంచి రెండురోజుల పాటు జరుగుతున్న జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం ఆలయం వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. రేణిగుంట - మామండూరు మీటరు గేజ్ రైల్వే ట్రాక్ నిర్మించేందుకు స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ ఇంజనీర్లు ప్రయత్నించారు. ఈ క్రమంలో చెరువు కట్టపై అడ్డుగా ఉన్న పుట్టను తొలగించేందుకు ఎంతో ప్రయత్నించి విఫలమయ్యారు. పైగా పుట్ట తొలగింపు చర్యలు చేపట్టిన బ్రిటీష్ ఇంజనీర్లు అనారోగ్యానికి గురయ్యారు. పుట్ట మరింత ఎత్తుకు పెరుగుతుండటంతో అమ్మవారి శక్తిని తెలుసుకుని గ్రామపెద్దలతో చర్చించారు. అందరూ కలిసి రైలు పట్టాలకు అవతల చెరువులో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. నాటి నుంచి కట్ట పుట్టాలమ్మగా విరాజిల్లుతోన్న అమ్మవారి జాతర మంగళవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు.

ముక్కంటిని దర్శించుకున్న రవిశంకర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద రవిశంకర్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని సోమవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ దర్శించుకున్నారు. ఆయనకు ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో అధునాతన పద్ధతులపై

ఆర్అండ్‌బీ, ఐఐటీల మధ్య ఎంవోయూ



ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణతో ఆర్అండ్‌బీ అధికారులు

ఏర్పేడు, సెప్టెంబరు 9: రోడ్ల నిర్మాణంలో అధునాతన పద్ధతులపై ఆర్అండ్‌బీ, ఐఐటీ ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీని సోమవారం రోడ్డు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నయీముల్లా సందర్శించారు. కొత్త సాంకేతిక పద్ధతులు, తక్కువ మెటీరియల్ ఉపయోగించి రోడ్లకు ఏర్పడిన గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చడం, అవి ఎక్కువ కాలం మన్నిక వచ్చేందుకు తీసుకోవలసిన చర్యలపై అధ్యయనం చేయాలని కోరారు. ఈ మేరకు ఐఐటీ అధికారులలో ఎంవోయూ కుదుర్చుకున్నారు. అమెరికా వంటి దేశాలల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం మన్నిక వచ్చే విధంగా రోడ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తించాలని నయీముల్లా ఐఐటీ అధికారులకు సూచించారు. అనంతరం ఐఐటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఈఈ మధుసూదనరావు, డీఈ నాగ మల్లయ్య, ఏఈ ప్రమీల, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురగయ్య నాయుడు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలు, వరద విపత్తులపై సమీక్ష



సమావేశమైన రైల్వే అధికారులు

రేణిగుంట, సెప్టెంబరు 9: రైలు ప్రమాదాలు, వరద విపత్తులపై రేణిగుంట రైల్వేస్టేషన్‌లో సోమవారం ఆ శాఖ అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. రైళ్లలో గంజాయి రవాణా, విదేశీ వ్యక్తుల కదలికలు, మానవ అక్రమ రవాణా, అవాంఛనీయ సంఘటనలు, వరదలు, విపత్తుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో స్టేషన్ మేనేజరు శేషగిరినాథ్ రెడ్డి, ఎస్ఎస్ఈ బాబురావు, వివిధ విభాగాల అధికారులు ఎస్ఎస్ రెడ్డి, నాగభూషణం, స్వామినాథన్, శివప్రసాద్, శ్రీహరి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్, రైల్వే ఇంటెలిజెన్స్ ఎస్ఐ రఘుప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో ఆర్థికాభివృద్ధి



రైతులకు రుణ ఆమోద పత్రాలను అందజేస్తున్న రాస్ అధికారులు

ఏర్పేడు, సెప్టెంబరు 9: ఉద్యాన పంటలతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని రాస్ పాపానాయుడుపేట ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి అన్నారు. పాపానాయుడుపేట రాస్ సేవా నిలయంలో సోమవారం రైతు రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతులు విడనాడి శాస్త్రీయ విధానాన్ని పాటించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చన్నారు. ఉద్యాన పంటల శాస్త్రవేత్త డాక్టర్ దివ్య మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కృషి విజ్ఞాన కేంద్రం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, రైతుల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వెంకటకుమార్, మునీంద్ర, ముని పార్థసారథి, కిరణ్ పాల్గొన్నారు.

జ్ఞానసిద్ధి వినాయకుడి సేవలో సుధీర్‌రెడ్డి



పట్టువస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టణంలోని గాంధీవీధిలో వెలసిన జ్ఞానసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. గాంధీవీధికి చెందిన మైనంపాటి దయాకర్ దంపతులు రూ.లక్ష విలువ చేసే వెండి ఆభరణాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయానికి అందజేశారు. వారిని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కాసరం రమేష్, నిర్వాహకులు కిషోర్, మధు, కుప్పయ్య, వరదరాజులు, మహేష్, వివేక్, శీను, రాకేష్, నవీన్, మైనంపాటి సుధ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామి వారికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో స్వామి వారిని శోభాయమానంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు, మహామంగళ హారతులు సమర్పించారు.

నిత్యాన్నదానానికి రూ.1.26 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న రాజేష్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం పట్టణానికి చెందిన రాజేష్ కొఠారి రూ.1.26లక్షలు, మేధో దక్షిణామూర్తికి వెండి గంధపు గిన్నె, ముత్యాలమ్మకు వెండి చెంబు వితరణగా అందజేశారు. వాటిని డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కోలాహలంగా గణేశ్ నిమజ్జనం





సత్యవేడు, వరదయ్యపాళెంలో నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు - ఏర్పేడు మండలం చిందేపల్లిలో గ్రామోత్సవం

సత్యవేడు, సెప్టెంబరు 9: మండలంలో గణేశ్ నిమజ్జన వేడుకలను పలు ప్రాంతాల్లో సోమవారం కోలాహలంగా జరిగాయి. వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలను మూడవ రోజు నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా వినాయక మండపాల వద్ద యువకులు ఉట్టికొట్టి సందడి చేశారు. అన్నదానం చేశారు. నిమజ్జనం సందర్భంగా గ్రామాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏర్పేడు: మండలంలో గణనాథుని నిమజ్జనం వేడుకగా జరిగింది. వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పేడులోని అశోక్ నగర్, జంగాలపల్లి, దుర్గిపేరి, చిందేపల్లి, వికృతమాల గ్రామాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. వికృతమాలలో వినాయకుడి లడ్డూను గ్రామానికి చెందిన టీటీడీ డిప్యూటీ ఈవో రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి రూ.25వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఆ లడ్డూను గ్రామస్తులకు పంచిపెట్టారు.

కేవీబీపురం: మండలంలోని గ్రామాల్లో సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఓళ్లూరులో సర్పంచు సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జనం జరిగింది. బీఎన్ కండ్రిగ తూర్పుమిట్ట, వినాయక వీధి, ఈబీసీ కాలనీ, కాటూరు, నీర్పాకోట, కారణి, నెలవాయి, పార్లపల్లి, ఆలత్తూరు, పీవీకండ్రిగ, పదవమైలు, గాజులపెళ్ళూరు గ్రామాల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది.

వరదయ్యపాళెం: మండలంలోని వరదయ్యపాళెం, పాండూరు, కంచరపాళెం, బత్తలవల్లం, పులివల్లం, సంతవేలూరు, సీఎల్ఎన్‌పల్లి, కళత్తూరు గ్రామాల్లో వినాయక నిమజ్జనం వేడుకగా జరిగింది.

రేణిగుంట: మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను సోమవారం నిమజ్జనం చేశారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటాల నడుమ బొజ్జ గణపయ్య విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు



పెరిందేశం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రవి మనోహరాచారి

కేవీబీపురం, సెప్టెంబరు 9: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఎస్పీ రవి మనోహరాచారి హెచ్చరించారు. పెరిందేశం, రాగిగుంట గ్రామాల మధ్య ఆదివారం జరిగిన వివా దాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం కేవీబీపురం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ రెండు గ్రామాల వారు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. దోషులు ఎంతటి వారైనా వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పెరిందేశం గ్రామస్తులు మాట్లాడుతూ తాము మీ మాట గౌరవించి వచ్చినపుడు, రాగిగుంటవాసులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పోలీసులు ఇరువర్గాల వారికి న్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఎవరిపై అన్యాయంగా కేసులు పెట్టబోమని, అయితే నిందితులను మాత్రం వదలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒకదశలో పెరిందేశం గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేయడానికి ప్రయత్నించగా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి విరమింపజేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఇరు గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా త్రివిక్రమరావు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 9: బుచ్చినాయుడుకండ్రిగ ఇన్‌చార్జి ఎంపీడీవోగా త్రివిక్రమరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సాయిలహరి కుప్పం మండలానికి బదిలీ అయ్యారు. దీంతో ఇదే కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న త్రివిక్రమరావును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా పరిషత్ కార్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

చిన్న విషయాలకు గొడవలొద్దు



పెరిందేశం గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎస్పీ రవికుమార్

కేవీబీపురం, సెప్టెంబరు 9: మండలంలోని పెరిందేశం, రాగిగుంట గ్రామాల మధ్య శనివారం సాయంత్రం చవితి వేడుకల్లో వివాదం చోటు చేసుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, డీఎస్పీ రవికుమార్ ఇరు గ్రామాలను సందర్శించి స్థానికులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఉత్సవాల సందర్భంగా చిన్నపాటి గొడవలు జరగడం సహజమని, వాటిని సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప ఘర్షణలకు దిగి విబేధాలను పెంచుకోవద్దని సూచించారు. పక్క పక్క గ్రామాల వారు కలిసి మెలసి ఉండాలన్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు, సెప్టెంబరు 9: పాపానాయుడుపేట వద్ద స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీఐ జయచంద్ర సీజ్ చేశారు. స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9: పట్టణంలోని ఎస్‌డీకే నగర్‌లో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయకుడిని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆయన అన్నదానం చేశారు. టీడీపీ నేతలు కంఠా రమేష్, మిన్నల రవి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సత్యవేడు ఆస్పత్రిని వంద పడకలకు పెంచండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న మునిసుబ్రహ్మణ్యం

సత్యవేడు, సెప్టెంబరు 9: సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని వంద పడకల స్థాయికి పెంచాలని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మునిసుబ్రహ్మణ్యం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌ను కోరారు. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజుతో కలిసి సోమవారం విజయవాడలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. సత్యవేడు ఆస్పత్రిలో సరైన వైద్య సదుపాయాలు, డాక్టర్లు లేకపోవడంతో పేద ప్రజలకు సరైన వైద్యం అందడంలేదన్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.ఏడు కోట్లతో నిర్మించిన అదనపు భవనాలు నిరుపయోగంగా మారాయని వివరించారు. త్వరితగతిన అభివృద్ధి చెందుతున్న సత్యవేడులో ప్రజలకు మెరుగైన వైద్యం అందాలంటే ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బంది నియమించి ఆస్పత్రిని వంద పడకలుగా మార్చాల్సిన అవసరం ఉందని మునిసుబ్రహ్మణ్యం మంత్రికి వివరించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌ను సోమవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, దశరధాచారి, నాయకుడు మిన్నల రవి ఆధ్వర్యంలో సన్మానించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో దేవకుమారి

బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 9: అంగనవాడీ కేంద్రాల్లో ప్రభుత్వం బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని సత్యవేడు సీడీపీవో దేవకుమారి అన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం నీర్పాకోట గిరిజన కాలనీలోని అంగన్ వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు సోమవారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారం ప్రతి రోజు క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. శిశువుకు ముర్రుపాలు పట్టిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శిల్ప, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు దివాకర్, మాధవి గర్భిణులకు రక్త పరీక్షలు, స్కానింగ్ చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి సుఖ ప్రసవానికి తీసుకోవలసిన జాగ్రత్తలను డాక్టర్ మాధవి వివరించారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వినాయకుడికి పూజలు



ఎస్వీపురంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దాతలు

వడమాలపేట, సెప్టెంబర్ 9: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఎస్వీపురంలో దొమ్మరాజు, వెంకమరాజు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పుత్తూరు: పట్టణంలోని కాపువీధిలో ప్రతిష్ఠించిన వినాయకుడికి బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో నిషిధ రాజుతో పాటు మండల అధ్యక్షుడు శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లు నిర్మించండి: భానుప్రకాష్



నితిన్ గడ్కరిని సన్మానిస్తున్న భానుప్రకాష్

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 9: నగరి నియోజకవర్గంలో జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లు నిర్మించాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కోరారు. సోమవారం ఆయన కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా కప్పి సత్కరించారు. చిత్తూరు - తచ్చూరు జాతీయ రహదారికి సంబంధించి పన్నూరు సబ్ స్టేషన్ క్రాస్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విజయపురం మండలంలో రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక సెజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నందున, సెజ్ ప్రాంతానికి అనువుగా సర్వీస్ రోడ్డు నిర్మించాలని కోరారు.

అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

పుత్తూరు, సెప్టెంబరు 9: పుత్తూరు పట్టణంలోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి కోరారు. ఇంగ్లీష్ సబ్జెక్టుకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు, ఆటోమొబైల్, మెకానికల్ సబ్జెక్టులకు ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్‌లో 50శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.